శనివారం SATURDAY 16.3.2024

**తెలంగాణ బిడ్డపై ఢిల్లీ బలప్రయోగం**

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం మన పత్రిక



వందలమంది పోలీసులను మోహరించి.. ఒక ఆడబిడ్డను, ఎమ్మెల్సీ కవితను ఎయిర్‌పోర్టుకు తరలిస్తున్న ఈడీ అధికారులు

# దర్యాప్తా.. దౌర్జన్యమా!

## కవిత అక్రమ అరెస్ట్

ప్రజాస్వామ్యంపై చీకటి ముసురుకున్నది. ప్రత్యర్థులను ప్రజాక్షేత్రంలో ఎదుర్కొనలేని పిరికితనం తప్పుడు కేసుల పంజా విసురుతున్నది. అధికారం కుట్రలు, కుహకాల సంకెళ్లు బిగిస్తున్నది. ఇంగితం మరిచిన అహంకారం ఎంతకైనా తెగిస్తున్నది. ప్రజాస్వామ్యం ముసుగులో కొన్నేండ్లుగా సాగుతున్న నియంతృత్వంలో తాజా అంకం.. భారత జాగృతి సారథి, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టు!

ఈడీ కేసుల్లో మహిళలకు రక్షణపై సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగానే, అరెస్టు చేయవద్దన్న అత్యున్నత న్యాయస్థాన ఆదేశం అక్షరాలై నిలిచి ఉండగానే, అరెస్టు చేయబోమని ఇచ్చిన మాట తడి మారకుండా ఉండగానే, 'చీఫ్ ఆదేశం' అంటూ ఈడీ శుక్రవారం కవితను అరెస్టు చేసింది. కేవలం సోదాల కోసం వచ్చామని ముందు చెప్పి, కోర్టు సమయం ముగిసేదాకా గడిపి, అకస్మాత్తుగా శుక్రవారం సాయంత్రం, గౌరవ ప్రజా ప్రతినిధి, చట్టసభ సభ్యురాలైన మహిళను, తెలంగాణ కోసం నిలబడ్డ పోరాటాల బిడ్డను, వందలాది పోలీసులను మోహరించి ఈడీ అరెస్టు చేసింది.

ఏండ్లు గడుస్తున్నా ఎటూ తేలని కేసులు, కోర్టులో ఆవలి తీరం చేరని వాదనలు, సోదాలు అరెస్టులంటూ సాగే వేధింపుల దర్యాప్తుల లోగుట్టు తెలియనిది ఎవరికి? ఈడీ తొడుగు లోపలున్న కోడ్ భాష గురించి కొత్తగా తెలుసుకోవాల్సింది ఏమున్నది? ఇది వెర్రితలలు వేసిన అధికార దాహపు వికృతరూపం. అన్ని ప్రజాస్వామ్య వ్యవస్థలను ఉక్కుపాదాల కింద తొక్కేస్తున్న అహంకారం. ప్రత్యర్థి పార్టీలపై అధికార వ్యవస్థలను నిస్సిగ్గుగా ప్రయోగిస్తున్న అణచివేత చర్యల నిజ స్వరూపం. చైతన్యవంతులైన తెలంగాణ ప్రజలకు అన్నీ తెలుసు. ఒక ఎన్నికలో గెలుపు కోసం, తెలంగాణ ఆత్మ బీఆర్ఎస్‌ను అణచివేయడం కోసం, ఎంతకైనా దిగజారడానికి సిద్ధపడుతున్న సిగ్గుమాలినతనం.. అధికారమై, మైకుల ముందు వికాసాల నినాదాలతో పొడబెబ్బలు పెడుతున్న తీరును ప్రజలు గమనిస్తున్నరు. మోదీ బీజేపీ ప్రభుత్వ తీరు ఎమర్జెన్సీని మించిపోయిందని ప్రజాస్వామిక వాదులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడో నమోదైన కేసులో కేవలం ఎన్నికల షెడ్యూల్‌కు ఒక్క రోజు ముందు అరెస్టు చేయడం కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే అని వారు స్పష్టం చేస్తున్నారు.

**చివరాఖరు:** 'ముందు ఈడీ తర్వాత మోదీ' అన్నది మరోసారి రుజువైంది. శుక్రవారం ఈడీ అధికారులు కవిత ఇంట్లో సోదాలు మొదలుపెట్టి కొన్నిగంటలు గడవక ముందే మోదీ హైదరాబాద్ వచ్చి మల్కాజిగిరిలో రోడ్‌షో నిర్వహించారు.

- ఢిల్లీ మద్యం కేసులో ఈడీ దుందుడుకు ధోరణి
- ఎన్నికల షెడ్యూల్‌కు ఒక్కరోజు ముందు చర్య
- సుప్రీంలో కేసు పెండింగ్‌లో ఉండగానే యాక్షన్
- కోర్టుకు ఇచ్చిన మాటనూ పక్కనబెట్టిన వైనం
- వందలమంది పోలీసుల నడుమ ఢిల్లీకి తరలింపు

• అమ్మ ప్రేమ..



శుక్రవారం ఈడీ అరెస్ట్ సమయంలో తనకేం కాదని ధైర్యంగా ఉండాలంటూ కుమారుడు ఆదిత్యను సముదాయిస్తున్న ఎమ్మెల్సీ కవిత

## నేడు రాష్ట్రవ్యాప్త ధర్నాలకు బీఆర్ఎస్ పిలుపు

- హైదరాబాద్‌లో రోజంతా సాగిన హైడ్రామా
- ముందే కవిత అరెస్టుకు పక్కా ప్లానింగ్
- ఆమె పేరుపై విమానం టికెట్ బుకింగ్
- సోదా కోసమే వచ్చామని ఈడీ బుకాయింపు
- కోర్టు సమయం ముగిసేదాకా తనిఖీలు
- గంటపాటు కవిత స్టేట్‌మెంట్ నమోదు
- కవిత ఇల్లు దిగ్బంధం.. ఎవ్వరికీ నో ఎంట్రీ
- ఈడీ అధికారులను నిలదీసిన కేటీఆర్
- ట్రాన్సిట్ వారంట్ లేకుండానే అరెస్టు.. అర్ధరాత్రి ఢిల్లీలోని ఈడీ ఆఫీసుకు తరలింపు
- నేడు వైద్య పరీక్షలు.. తర్వాత కోర్టుకు
- కస్టడీ పిటిషన్ వేయనున్న ఈడీ ఆఫీసర్లు
- సుప్రీంకోర్టులో కవిత చాలెంజ్ పిటిషన్!

• కేటీఆర్ సంవాదం



ట్రాన్సిట్ వారంట్ లేకుండానే కవితను ఎలా అరెస్ట్ చేస్తారంటూ అధికారులను ప్రశ్నిస్తున్న కేటీఆర్. చిత్రంలో హరీశ్ కూడా ఉన్నారు.

• **సడలని ధైర్యం**



## అసలు స్కాం ఎక్కడుంది?

### ఆధారాలు లేకుండా దర్యాప్తు ఏమిటి: ఢిల్లీ కోర్టు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): 'ఢిల్లీ మద్యం విధానం'లో అసలు కుంభకోణం ఎక్కడ ఉన్నదని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)ని ఢిల్లీలోని రౌస్‌అవెన్యూ కోర్టు నిరుడు మే 7న సూటిగా ప్రశ్నించింది. ఈ కేసులో ఈడీ తగిన సాక్ష్యాధారాలతో దర్యాప్తు కొనసాగించడం లేదని అసహనం వ్యక్తంచేసింది. స్టేట్‌మెంట్ల సాయంతో తప్ప.. ఆధారాలకు అనుగుణంగా ఈ దర్యాప్తు కొనసాగడం లేదని అభిప్రాయపడింది. అప్రూవర్ చెప్పిన వివరాలనే ఈడీ ప్రామాణికంగా తీసుకోవడంపైనా ఆగ్రహం వ్యక్తంచేసింది. రూ. 100 కోట్ల అక్రమాలు జరిగినట్టు చెప్తున్న ఈడీ.. నగదును మాత్రం లక్షల్లోనే చూపించడంపై విచారణ సందర్భంగా న్యాయమూర్తి ఎంకే నాగ్‌పాల్ విస్మయం వ్యక్తంచేశారు. మద్యం పాలసీలో అక్రమ లావాదేవీలు జరిగాయనడానికి ఈడీ తగిన ఆధారాలు చూపించట్లేదని జడ్జి అసంతృప్తి వ్యక్తం చేశారు.



జడ్జి నాగపాల్

## ఈడీది కోర్టు ధిక్కారమే!

### న్యాయ నిపుణుల అభిప్రాయం

- సుప్రీంకోర్టునూ ఖాతరు చేయని అధికారులు
- కోర్టులో కేసు పెండింగ్ ఉండగానే కవిత అరెస్టు
- అరెస్టు చేయబోమంటూ మాట ఇచ్చి తప్పారు
- ట్రాన్సిట్, అండర్‌టేకింగ్ రూల్స్‌కు తిలోదకాలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అరెస్టు విషయంలో ఈడీ తీరు చట్టబద్ధమేనా? న్యాయ సమ్మతమైనదేనా? కోర్టు ఇచ్చిన ఆదేశాలకు లోబడే ఉన్నదా? న్యాయస్థానంలో కేసు పెండింగ్‌లో ఉండగానే స్వతంత్రంగా వ్యవహరించిన ఈడీ వైఖరిని న్యాయ కోవిదులు తప్పుబడుతున్నారు. ఇది ముమ్మాటికీ కోర్టు ధిక్కరణ కిందకే వస్తుందని అభిప్రాయపడుతున్నారు. సీఆర్‌పీసీ చట్టాన్ని పట్టించుకోకుండా.. కేసుల విచారణ, అరెస్టుకు సంబంధించి కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్-1973 (సీఆర్‌పీసీ)లో మహిళలకు కొన్ని రక్షణలు కల్పించారు. ఈ నిబంధనలు మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) › 11వ పేజీలో



**మోదీవి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు**

కవిత అరెస్టు అప్రజాస్వామికం

బీజేపీ కుట్ర.. కాంగ్రెస్‌తో లోపాయికారి ఒప్పందం

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ › 5

**మరో రాజకీయ అరెస్ట్** › 2

శివసేన ఎంపీ ప్రియాంక చతుర్వేది



**ఓటమి భయంతోనే..**

రాజ్యాంగ సంస్థల దుర్వినియోగం: అఖిలేశ్ › 10

## వేధింపే రాజకీయం

**పేరేదైనా కానీ, టార్గెట్ విపక్షం.. సెక్షన్లు ఏవైనా కానీ, టార్గెట్ ప్రతిపక్ష నాయకులు.. ఇదీ మోదీ బీజేపీ ఈడీ, ఐటీని వాడుతున్న తీరు. గత పదేండ్ల కాలంలో దేశంలోని దాదాపు అందరు ప్రతిపక్ష నాయకులపై ఈడీ, ఐటీ కేసులు నమోదయ్యాయి. ఇందులో ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు, మంత్రులు, జాతీయ ప్రాంతీయ పార్టీల అధ్యక్షులు... ఎవరికీ దీన్నుంచి మినహాయింపులేదు. ఒక్క బీజేపీలో చేరిన వారికి తప్ప! అయితే బీజేపీలో చేరాలి.. లేదా దానికి లొంగాలి. ఇదీ తీరు. దేశంలో ఈడీ, ఐటీ కేసులు ఎదుర్కొంటున్న ప్రముఖుల జాబితా ఇది...**

- **కాంగ్రెస్:** సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, పీ చిదంబరం, నళినీ చిదంబరం, కార్తీ చిదంబరం, పంజాబ్ మాజీ సీఎం చరణ్‌జిత్ చన్నీ సోదరుడు, మాజీ సీఎం అశోక్ గెహ్లాట్ సోదరుడు, భూపేందర్ హుడా, ఇబోబీ సింగ్, డీకే శివకుమార్.
- **టీఎంసీ**: అభిషేక్ బెనర్జీ, మదన్ మిత్రా, ఫర్హద్ హకీం, కునాల్ ఘోష్, సౌగతరాయ్, పార్థా చటర్జీ.
- **శివసేన (ఠాక్రే)**: సంజయ్‌రౌత్, అనిల్ పరబ్, ఆనంద్‌రావ్ అద్సుల్.
- **ఎన్సీపీ**: శరద్ పవార్, అజిత్ పవార్ (ఎన్సీపీ-పవార్ వర్గం), నవాబ్ మాలిక్, అనిల్ దేశ్‌ముఖ్, ఛగన్ భుజ్‌బల్, ఏక్‌నాథ్ ఖడ్సే.
- **ఆర్జేడీ**: లాలూప్రసాద్ యాదవ్, తేజస్వీ యాదవ్, మీసా భారతి.
- **ఎస్పీ**: అఖిలేశ్ యాదవ్.
- **బీఎస్పీ**: మాయావతి.
- **ఆమ్ ఆద్మీ పార్టీ**: అరవింద్ కేజ్రీవాల్, సత్యేంద్రజైన్, మనీశ్ సిసోడియా.
- **సీపీఎం**: కొడియారి బాలకృష్ణన్ కుమారుడు.
- **జేఎంఎం**: ఝార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరేన్
- **నేషనల్ కాన్ఫరెన్స్**: ఫరూక్ అబ్దుల్లా.
- **బీఆర్ఎస్**: కల్వకుంట్ల కవిత, నామా నాగేశ్వర్‌రావు